గంటన్న కొడుకు చచ్చిపోయేడు!

పట్టుమని పదేళ్ళు నిండకుండానే చనిపోయేడు. గంటన్న, భార్య రావులమ్మ, పెద్ద కూతురు దేశిమ్మ వాడి శవం చుట్టూ మూగి అదే పనిగా శోకాలు తీయటం మొదలెట్టేరు.

క్రితం రోజు విరోచనాలు మొదలెట్టాయి. ఒకటే విధంగా నీళ్ళులా కూర్చున్నాడు. అక్కడికీ రావులమ్మ ఇంగువనీ, కషాయమనీ ప్రక్కింటి వాళ్ళ నడిగి ఇచ్చింది! ఫలితం కనపడలేదు.

చూస్తుండగానే ఒక్కసారి పిల్లవాడు నీరసించాడు. ముఖం పీక్కు పోయింది. కళ్ళు లోతుకు పోయేయి. కాళ్ళూ, చేతులు కొంగర్లు పోయేయి. కడుపు వీపుకు అతుక్కు పోయింది.

గంటన్న ఆ సమయంలో నారాయణరావుగారి పాటి దిబ్బల చేలో పని చేస్తున్నాడు. పారపని చేస్తున్నాడు. పది మంది కూలీల మధ్య పాదం లోతు నీళ్ళల్లో దిగి సత్తువ కొద్దీ మట్టి తిరగేస్తున్నాడు. పగలంతా చేస్తే నాలుగు రూపాయిల కూలి. పనివత్తిడి ఇంకా మొదలు కాలేదు. ఆ పని దొరకటమే అదృష్టంగా భావించేడు. పనివత్తిడి వస్తే ఒకటీ రెండు రూపాయిలు పెరుగుతాయ్!

పొద్దు కూకాక గంటన్న ఇంటికి చేరేడు. అప్పటికే కొడుకు జావగారి పోయేడు. ఆ రాత్రి జావ తాగ కుండానే జీవితం నుంచి పారిపోయేడు.

గంటన్న కుటుంబం తెల్లవార్లూ ఏడుస్తూనే ఉంది. గంటన్న మరీ మరీ ఏడ్చేడు. రెండు మూడు సంవత్సరాలు పోతే అర్ధకూలికైనా చేతి క్రింది కొస్తాడనుకున్న కొడుకు ఆశల్ని నీరు కార్చేసరికి కుమిలి కుమిలి ఏడ్చేడు!

ప్రక్కింటి వీరన్న వచ్చి...

'ఎందాక ఏడుస్త్రారా! ఏడిస్తే సచ్చినోడు తిరిగి వస్తాడా? పాతెడదాం పదండి' అన్నాడు. గంటన్న గుండె గతుక్కుమని బావురుమన్నాడు. వీరయ్య చేతులు పట్టుకుని వెక్కి వెక్కి ఏడ్చేడు.

వీరయ్య కళ్ళ వెంట కూడా నీళ్ళు తిరిగాయి. చుట్టూ నిలబడ్డ వాళ్ళు కళ్ళు కూడా చమర్చాయి.

గంటన్న కొంప బజారుకు ప్రక్కనే ఉంటుంది. వస్తూ, పోయే వాళ్ళు కూడా విషయం విని 'అయ్యో పాపం' అంటూ వెళ్ళారు.

అటుగా ఓంకారయ్య కూడా వచ్చాడు. ఓంకారయ్య భూతాల వైద్యుడు. మెలికలు తిరిగి నిటారుగా నిలబడే జుట్టూ, బుర్రమీసాలూ, నొసలుపై వెనుకటి కాణీ అంత ఎర్రటి కుంకుమ బొట్టూ అతని ముఖం గంభీరంగా కనపడేట్టు చేస్తాయి. మోకాళ్ళ వరకూ వదులుగా ఉండే తెల్లటి లాల్చీ, క్రింద వెంగావి రంగు పంచె, పైన భుజం మీద వ్రేలాడే ఎర్రటి ఉత్తరీయం. మెడలో రుద్రాక్షమాలల దండలూ, చేతిలో పన్ను క్రరా అతడు సాగించే ఒకానొక ప్రత్యేకమైన జీవితాన్ని అడక్కుండానే చూపిస్తాయి.

ఓంకారయ్య అక్కడ నిలబడి ఏమిటని అడిగాడు. ఎవరో సంగతి చెప్పేడు.

రెండడుగులు రోడ్డు దిగి గంటన్న వాకిట్లో కొచ్చేడు.

అక్కడి జనమంతా ఓంకారయ్య వైపుకి తిరిగేరు.

'ఏం గంటన్నా...అరెరె... ఎంత ఘోరం జరిగి నాది... మీరెప్పుడు తెలుసుకుంటారయ్యా...' ఓంకారయ్య అనేసరికి ఏడ్చే గంటన్న కుటుంబం కూడా ఏడ్పు ఆపేశారు. ఒక విధమైన నిశ్శబ్దం అలుముకుంది.

ఓంకారయ్య తన బొంగురు గొంతుతో బిగ్గరగా చెప్పటం మొదలేశాడు. 'నేనొకడినున్నానని మర్చిపోతే ఎట్టాగయ్యా! ఆ సమయంలో నా దగ్గర కొచ్చినట్ట యితే... ఒకటే ఒకటి... తాయెత్తిచ్చేవాడ్ని గదయ్యా! పట్టిన పీడ వదిలి టకాల్న కట్టుకొనేయ్ యిరోచనాలు! తాయెత్తు ధరదే వుండాది. తరువాత పని సేసుకు తీర్తుకునేవాళ్ళు...

# ఆలోచన

## బొల్లిముంత నాగేశ్వరరావు

ఈ మద్దెన బూతాలు అర్ధంతరంగా ఇలా ఇరుసుకు తింటన్నాయ్ జనాల్ని. ఎందుకని...అడగండి సెపు తాను...' అని ఓంకారయ్య నిలబడ్డాడు. ఎవరూ ఎందుకని అడగలేదు. అయినా ఓంకారయ్య చెప్పటం మొదలెట్టాడు.

ఊరు కట్టుబాట్లు పోతుండయ్. ఎవరి దారి ఆళ్ళదై పోతుండె. గ్రామ దేవతలకు కొలుపులు కొలిపి ఎన్నాళ్ళయ్యింది. ఎన్నాళ్ళయ్యిందని అడుగుతున్నా! పోతురాజు గుడి తలుపులు తెరిచి ఎన్నాళ్ళయ్యిందని అడుగుతున్నా! పోలేరమ్మ గుడి ముందు కోడి తెగి ఎన్నాళ్ళయ్యిందని అడుగుతున్నా! చెప్పండయ్యా...చెప్పండి.

ప్రెసిరెంటు గారికి చెప్పినా ఫలం లేకుండె...మరి జనం ఎట్ట బతుకు తారయ్యా!

ఇదిగో చెప్తున్నా... ముందు గ్రామశక్తులు తిన్నాకె మనం తినాల. ఆట్నే మర్చిపోతే అయి మనల్ని తింటయ్. ఈ రోజు గంటన్నకు అపకారం సేసిన శకితి... రేపు మనకు సెయ్య దనేదేంటి? ఆకలయిన గుర్రం ఆరిగ్గెడి మేస్తది. ఇదీ అంతే... ఆకలవుతున్న భూతానికి మేక పోతుల్ని పెట్టాలయ్యా! లేకపోతే ఎంటి జరుగుతది. ఇట్టాగే మన పీకట్టుకు తింటయ్!

ఇప్పుడు గంటన్న గతేంటి?' ఓంకారయ్య అని గంభీరంగా నిలబడ్డాడు.

ఆ మాటలు విని గంటన్న మరింత బిగ్గరగా ఏడ్చేడు.

ఇప్పటికైనా గ్రామ అవుసరాన్ని గుర్తించి, నలుగురూ ఒక చోటుకు చేరి భూతాల కొలుపులు నెరవేర్చే అవకాశాన్ని వెదకండి. లేకుంటే గంటన్న గతి మీకు పదుతుందన్నట్టు ఓంకారయ్య ఎర్రగా అక్కడ జేరిన జనాన్ని చూసి రోడ్డెక్కి వెళ్ళిపోయాడు.

చుట్టూ జేరిన జనం ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు. భూతాల చేష్ఠ కాకపోతే ఇలా ఉన్నట్టుండి పిల్లవాడు చనిపోవటమేమిటని అనుకున్నారు.

ఓంకారయ్య చెప్పింది నిజమే అనుకున్నారు.

గంటన్న ఉండే వీథి చివర ఆలయముంది. ఆలయానికి వెనుక చెరువు కూడా వుంది. ప్రతిరోజూ ఆలయంలో నైవేద్యం సమర్పించి రంగాచారి గారు అటుగానే వెల్తుంటారు. ఓంకారయ్య వెళ్ళిన కాస్సేపటికి ఆయన అటుగా రావటం-విషయం ఏమిటని అడగటం, గంటన్నకు కొడుకు చనిపోయేడని తెలుసు కోవటం జరిగింది.

గంటన్న కూలి మనిషి. కాస్తక్కూడా పిలవగానేపలికి పని చేసి పెట్టి వెల్తాడు. ఎంతిస్తే అంత తీసుకుంటాడు. మెత్తటి మనిషి. పరుల్ని పన్నెత్తి మాటని ఎరుగడు.

అలాంటి గంటన్నకు కొడుకు చనిపోయాడని తెలీగానే రంగాచారి గారికి మనసు చివుక్కుమంది. ఎడంగా నిలబడైనా పలకరించి పోవటం మంచిదనుకున్నాడు.

రెండడుగులు రోడ్డుదిగి...

'వేకువనే అశుభవార్త... ఏం గంటన్నా! ఎంత అపరాధం జరిగిపోయింది. వాడికి జబ్బు పట్టుకున్న సమయాన నా వద్దకు రాకూడదూ! వాడి పేరున దైవార్చన జరిపి... వాడి ఆరోగ్యం కోసం- దీర్ఘాయుష్షు కోసం భగవానుని ప్రార్థించేవాడిని... మీకెందుకు తోస్తుందిరా అది... చచ్చాక ఏడ్వటం తప్ప...

మనుష్యుల్లో ఇప్పుడు భక్తి భావం తగ్గి పోతుంది! అనర్థకాలు దొర్లి పోతున్నాయి.

ఏడ్వకు గంటన్నా... చేసేదేముంది. అంతా పైవాడి లీల! సర్వేశ్వర్చ సర్వాత్మానిజేచ్ఛాతః కరిష్యతి' అన్నారు. భగవానుడు తన ఇష్టానుసారం చేయగలడు. మనదేముంది. నిమిత్తమాత్రులం! నొసటి వ్రాతని, కర్మఫలాన్నీ ఎవరు తప్పించగలరు గనుక! అదొక్క సర్వేశ్వరుడికే సాధ్యం. అందుకే నిరంతర భక్తి మోక్షాన్నిస్తుందని

పెద్దలు ప్రవచించారు.

వాడి ఆత్మశాంతి కోసం ఏదైనా అర్చన జరుపుదాం. ఒకసారి గుడిని సందర్శించు. భగవత్ప్రార్థన జరుపు దువ్‌గాని' అన్నాడు.

గంటన్న రంగాచారిని చూసి, ఆయన మాటలు విన్నాక మరింతగా ఏడ్చాడు.

'ఎందుకేడుస్తావ్! చేతులు కాలాక ఆకులు పట్టుకుని ఏం ప్రయోజనం. భగవద్భక్తి, అర్చనానురక్తి ఉంటే ఈ అమంగళం జరిగేది కాదు. భగవంతుడు అందరి వాడయ్యా గంటన్న... ఆయన దృష్టిలో పేదలేదు-పెద్దలేదు. మీరు కూడా గుడికి వచ్చే అలవాటు చేసుకోండి. ఉన్న దాంట్లోనే ఫలం- పత్రం మీకు తోచింది సమర్పింస్తుండండి. ఈ అశుభాలు అరికట్టబడ తాయి ఏడవకు-ఏడవకు...'

రంగాచారిగారు ఓదార్చి రోడ్డెక్కాడు.

ఆయనటు పోగానే పరంధామయ్య మాస్టారుగారు బడికి పోతూ గంటన్న ఇంటి ముందరి దృశ్యాన్ని చూశాడు.

రోడ్డు దిగి అక్కడికి వచ్చాడు. పరంధామయ్య మాస్టారు గారికి గంటన్నను అనేక సార్లు పలకరించిన పరిచయముంది. పిల్లల్ని చదివించమని ఎప్పుడూ అడుగు తుండేవాడు. వచ్చి విషయం తెలుసుకున్నాడు.

'పెద్ద పిల్లను చదివించకపోతే మానె-పిల్లవాడినన్నా బడిలో జేర్చు గంటన్నా' అంటుండేవాడు.

'ఎందుకు బాబూ మాకు సదువు. సదువుకున్నోరే ఊర్లో సాలా మంది ఉద్దోగంలేక తిరుగుతుండారు. ఆరికే రాని ఉద్దోగం మాకు వస్తదా?'

'చదువు ఉద్యోగానికే కాదు గంటన్నా! కాస్త విజ్ఞానానికి'

'ఎందుకులెండి బాబు అది మాత్తరం. తిండి బెట్టంది ఏదైనా దండగే...'

'మాస్టారు కేం చెప్పాలో తోచేది కాదు.

'తిండి పెట్టంది ఏదైనా దండగే' తిండి పెట్టి చదువు చెప్పే ప్రణాళిక ఏదైనా ప్రభుత్వం ఆలోచిస్తే గంటన్న కూడా బడిలో పిల్లవాడ్ని జేరుస్తాడేమోనని మనసులో అనుకుంటుండేవాడు. ఆ ప్రణాళిక రాలేదు. ఇప్పుడు నడుస్తున్న మధ్యాహ్న భోజనం ఎంత తిండి పెడుతుందో తను ఒకదరిని చూస్తూనే ఉన్నాడు. అప్పట్లో కనీసం ఇదున్నా గంటన్న పిల్లవాడ్ని జేర్చేవాడు.

మనసులో అనుకుని...

'గంటన్నా' అన్నాడు.

'పంతులుగోరా...' గంటన్న తలెత్తి మరలా భోరున ఏడ్చేడు.

'ఊరుకో ఏడవకు. కొంత మన చేతులో ఉన్నా అంతా మన చేతులో లేదు. ఈ దేశంలోని అనేక అరిష్టాలు చదువు లేక పోవటం వల్లని ఎంత మందికి తెలుసు. 'విద్య నిగూఢ గుప్తమగు విత్తము...' అన్నారు పెద్దలు! మన దేశంలో ఇంకా నూటికి అరవై మందిదాకా చదువుకోని వాళ్ళున్నారు. కాస్త చదువుకుంటే అనేక విషయాలు తెలుస్తాయి. ఏ జబ్బు ఎందుకు వస్తుంది. దానికి ఏం వాడుకుంటే అది త్వరగా నయమవు



తుందీ... మొదలుగా గల అనేక విషయాలు తెలుస్తాయి. అందుకే 'బడి'ని ఆధునిక దేవాలయమన్నారు పెద్దలు. మనిషిలో మహాత్ముడ్ని వెదికి బయటకు తీసేది 'బడే' అని మనదేశంలో ఎంత మందికి తెలుసు? బడికి దూరంగా, అజ్ఞానంగా, అంధకారంలో బ్రతుకుతూ ఎంత మంది అలమటించి నశించి పోతున్నారో ఈ దేశం పరిస్థితిని తలచుకుంటుంటె గుండె దిగ జారిపోతుంది. పేదరికాన్ని బాగు చేసేది ఒక్క విద్యే అని గుర్తించిన రోజున గంటన్న కూడా బాగుపడతాడు... మాస్టారు చెప్తున్నాడు. చుట్టూ జేరిన జనం వింటున్నారు. గంటన్న, అతని కుటుంబం కూడా వింటున్నారు.

'అకాల మరణాలు, ఆకలి చావులు, అజ్ఞానంలో'అధిక వడ్డీలకు అప్పుల్ని తెచ్చుకుని పడే బాధలు

అనేకానేకం ఈ పాఠశాలలోని విద్య పరిష్కరిస్తుందని ఎంత మందికి తెలుసు? తేలీదు. నూటికి అరవై, డెబ్బై మంది దాకా తెలీదు'.

మాస్టారు మరలా అని గంటన్న నోదార్చి వెళ్ళి పోయేడు.

గంటన్న మరింతగా ఏడ్చేడు.

తాయెత్తు కట్టినా తన కొడుకు బతికేవాడు! గుడిలో అప్పుడప్పుడు ఓ కొబ్బరి కాయ కొట్టినా తన కొడుకు బతికేవాడు. పంతులుగారు అడగంగానే బడిలో జేర్చి చదువు చెప్పించినా తన కొడుకు బతికే 'వాడు పై మూడింటిలో తనేమీ చెయ్యలేకపోయేడు.

గంటన్నకు దుఃఖం మరింత ఎక్కువయ్యింది. ఆఖరు ఏడ్పు ఏడ్చి కొడుకును పాతేయటానికి కళ్ళు తుడుచుకు లేచాడు.

ఇంతలో ఏదో జీపు రోడ్డు మీద ఆగింది. జన మంతా అటు వైపుకి తిరిగారు.

అందులోంచి ఎవరో దిగేరు. అంతా తెల్లటి బట్టల్లో ఉన్నారు. మనుష్యులు నిండుగా, ఎర్రగా రంగుల్లో ఉన్నారు. వారేదో మాట్లాడుకుని గంటన్న ఇంటి వైపుగా కదిలి వచ్చేరు.

వచ్చి విషయం ఏమిటని అడిగేరు.

ప్రక్కింటి వీరన్న విషయం చెప్పేడు. గంటన్న మరలా కన్నీరు కారుస్తూ దుఃఖ పడిపోయేడు.

ఆ వచ్చిన మనుష్యుల్లో కాస్తలావుగా ఉన్న మనిషి

'ఎంత చెప్తే ఏం ప్రయోజనమయ్యా! వాల్‌పోష్టర్లు వేస్తున్నాం. సినిమాలు చూపిస్తున్నాం. పరిశుభ్రంగా ఉండండి. పది కాలాల పాటు బతకండీ అని... అయినా మీరెందుకు వింటారు. ఇంటి చుట్టూ మురుగు.. ఈగల మోత. రాత్రిళ్ళు దోమలు. మేం మందులు, కొట్టినా, మరేమయినా చేసినా ప్రయోజనం శూన్యం. మీ పనిమీదే. ఈ పిల్ల వాడెందుకు చని పోయాడనుకున్నారు 'డయేరియా' వల్ల చనిపోయేడు. 'డయేరియా' అంటే మీకు తెలుసా? తెలిసే ఉంటు ంది. ఎందుకంటే ఇంతకు ముందా పిల్లవాడ్ని చూసేరు కాబట్టి. విరోచనాల జబ్బు... ఆ జబ్బు ఎందుకొస్తుందో తెలుసా... 'పరిశుభ్రంగా లేకపోవటం వల్లా పోషకాహార లోపం వల్లా.

పిల్లవాడికి మంచి ఆహారవిహారాల. పెరిగే వయసు. పాలూ, కోడిగుడ్లూ, పప్పు దినుసులూ ముఖ్యంగా ఆహారంలో ఉండాలి. ఆ లోపం జరగటం వల్ల చూడండి నూరు కాలాల జీవితం మొగ్గలోనే పదైనా నిండకుండా వాడిపోయింది.

ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టరుగారు తన బృం దంతో వెళ్తూ వెళ్తూ విషయం తెలిశాక చెప్పిన మాటలు. చివాట్లు పెడుతున్నట్టు మాట్లాడేడు.. అక్కడికి దగ్గరూరులోనే హెల్త్ సెంటరుంది. పట్నం నుండి ఆయన అప్పుడప్పుడా హెల్త్ సెంటర్‌ను విజిట్ చేసిపోతాడు. వచ్చిన రోజున, అక్కడికి వచ్చిన వాళ్ళను పరీక్షించి, ఏవోమందులిస్తాడు

డాక్టరుగారి మాటలు విని గంటన్న మరింత బావురు, మనస్నాడు.

* * *

మూడు రోజులు గడిచాయి. ఎంత మర్చిపోదామన్నా కొడుకు జ్ఞాపకాలు గంటన్ననునిత్యం వేధిస్తూనే ఉన్నాయి.

పనివత్తిడి వచ్చింది. కూలి పెద్దగా పెరగటం లేదు. ఉన్న రైతులంతా ఒక కట్టడిగా కూడారు. ఐదు రూపాయిల కంటే పైసా కూడా ఎక్కువ యివ్వ మన్నారు.

ఇకనైనా కూలికి పోకపోతే సంసారం గడవటం కష్టం- ఈ నాలుగురోజులూ ఎలాగో గడిచిపోయింది. గంటన్న బయటకి వచ్చేడు. రచ్చబండ దగ్గర జనం గుమి గూడేరు.

ఎవరో కుర్రవాడు ఆవేశంగా చెప్తున్నాడు. గంటన్న కాళ్ళు నెమ్మదిగా అక్కడికి నడిచాయి.

'...ఎప్పుడు మనం తెలుసుకుంటాం! ధరలు ఆకా శం వైపుకి పెరుగుతున్నాయి. బతుకు క్షణ క్షణానికీ దుర్భరమై పోతుంది!

అసలు మనం బతుకుతున్నామా అని... మనదీ ఒక బతుకేనా అని...' కుక్కలవలె-నక్కలవలె పందుల్లో పందులవలె మనదీ ఒక బతుకేనా...' చెప్పండి.

పట్టెడన్నం పెట్టుకోలేక మనం మన చిరంజీవుల్ని చేజేతులా చంపుకుంటున్నాం. పోషకాహారం దొరక్క వాళ్ళంతా అకాలమరణాల పాలవుతున్నారు.

కుర్రవాడు చెప్పుకుపోతుంటే గంటన్న గతుక్కు మన్నాడు.

...'ఎందుకని మన పిల్లలకు పోషకాహారం దొర క్కుండా పోవాలి. ఇక్కడే మనం ఆలోచించాలి. మనం కాళ్ళతో నడిచినట్టే, చేతుల్తో పని చేసినట్టే, కళ్ళతో చూసినట్టే... మెదడుతో ఆలోచించాలి. మనం చేతులు పని చెయ్యకపోతే అవి చచ్చు పడినయ్యని చెప్తాం- కాళ్ళు నడవటానికి పనికిరాకపోతే పోలియో సోకిందంటాం. మరి మెదడు ఆలోచించకపోతే ఏమనాలి. మన బుర్ర ల్లోని మెదడులన్నీ చచ్చుపడినట్టేనా?

ఆలోచించండి...

ఈ సమాజంలోని భూమి- సంపదా ఈ గ్రామం లోని నారాయణ లాంటి కొందరు చేతుల్లోనే ఎందు కుండి పోయేయి. మధ్య తరగతి రైతులు పేద కూలీ లుగా, పేదలు మరింత పేదలుగా ఎందుకని మారి పోతున్నారు. నారాయణ అంతస్తుపై అంతస్తూ, లక్షల మీద లక్షలు ఎలా సమకూర్చుకోగలుగుతున్నాడు.

అంతటికీ ఒకే ఒక్క కారణముంది...

మీలో ఉన్న అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని, మీ శ్రమశక్తిని నిలువునా దోపిడీ చేస్తున్నారు. తక్కువ కూలిచ్చి ఎక్కువ పని చేయించుకుంటున్నారు. మీ అవుసరాల్లో అధిక వడ్డీల కప్పులిచ్చి మీకున్న కుంటా, శెంటూ కాజేసి తమ భూముల్లో కలుపుకుంటున్నారు.

ఫలితంగా మనకు తిండి దొరకటం లేదు.

ఈ తిండి దొరకని వాళ్ళశ్రమే అక్కడి తిండి బోతుల విలాసాలకు మూలం.

మీరు పారపని చెయ్యందే-మీరునాట్లేయందే, మీరు కలుపులు తీయందే, మీరు కోతలు కోసి కుప్పలు నూర్చందే నారాయణ గాదెలు నిండవని మీరు గమనించిన రోజున మీ మెదడు పని చేసినట్టుగా గుర్తించండి! ఇప్పుడు మరి కాస్త ఆలోచించండి.

అందుకే మనం సమ్మెలోకి వెళ్తున్నాం. మనమంతా ఒకటిగా మారి, మనవూ సంఘటితశక్తిగా మారి, మనం లేనిదే ఇక్కడేమీ జరుగదని నిరూపిద్దాం. మనం కొన్ని హక్కుల్ని సాధించుకుని మనం తిని, మన పిల్లల్ని బతికించుకుందాం

మనం తలలు వంచి గొర్రెల్లా కలవారి భూముల్లో ేకెరీ చేసినంతకాలవూ మనకు భవిష్యత్తు లేదు. మన బతుక్కు భరోసా లేదు. మన జీవితానికి గ్యారంటీ లేదు. మన పిల్లలకు పంటి క్రిందకు కమ్మటి తిండి రాదు. కంటిమీదకు నిండుగా ఉన్న కునుకు రాదు-

ఆలోచించి సంఘంలో చేరండి. సమ్మెకు తల పడండి...!

ఆ కుర్రవాడు చెప్పుకుంటూ పోతున్నాడు. గంటన్న శ్రద్ధగా విన్నాడు. పోషకాహారం లేక తన కొడుకు చనిపోయేడని డాక్టర్ చెప్పిన దానికీ, ఆ పోషకాహారం ఎ౦దుకు లేకుండా పోతుందో, తన పేదరికానికి ఏది కారణమో ఈ కుర్రవాడు చెప్తున్న దానికీ ఏదో సంబంధముంది...

గంటన్న మనసు ఆలోచించటం మొదలెట్టింది!!

